# మిర్యాలగూడ.. గులాబీమయం

- గులాబీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపిన కేసీఆర్
- రోడ్‌షోకు భారీగా హాజరైన జనం, పార్టీ కార్యకర్తలు



రోడ్‌షోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, క్యాకర్తలు

## బీఆర్‌ఎస్ క్యాడర్‌లో జోష్

**రోడ్‌షోకు వెల్లువలా హాజరైన జనం**

మిర్యాలగూడ, ఏప్రిల్ 24: బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బుధవారం మిర్యాలగూడ పట్టణంలో చేపట్టిన రోడ్‌షోకు పార్టీ శ్రేణులతోపాటు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తాము ఊహించిన దానికంటే అత్యధికంగా ప్రజలు హాజరు కావడంతో పార్టీ క్యాడర్‌లో జోష్ నింపింది. పట్టణ నలుమూలల నుంచి ప్రజలు, రైతులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో సాగర్ రోడ్డుకు చేరుకున్నారు. దాంతో సాగర్ రోడ్డుపై ఇసుక వేస్తే రాలనంతా జనంతో నిండిపోయింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేయడంతో వాటి లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా.. కేసీఆర్‌ను చూసేందుకు.. ఆయన ప్రసంగాన్ని వినేందుకు ఆసక్తి కనబర్చారు. జనమంతా కేసీఆర్ బస్సు యాత్ర వెంట ర్యాలీగా నడిచారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సబ్సిడీ విత్తనాలు, సకాలంలో పంట కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించడం, పేదలకు ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు, గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్, పోడు భూములకు పట్టాలు వంటి పథకాలను ఆయా వర్గాల ప్రజలు గుర్తు చేసుకుంటూ కేసీఆర్ వెంట నడిచారు. ఈ సందర్భంగా కళాకారుల ఆటపాటతో రోడ్‌షో ఆద్యంతం హోరెత్తింది. ఇదే హోరు.. జోరు మే 13 వరకు కొనసాగాలని, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని సీఎం కేసీఆర్ కోరగా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, రమావత్ రవీంద్ర కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మోసీన్‌అలీ, నల్లమోతు సిద్ధార్థ, పాలుట్ల బాబయ్య, కరుణాకర్‌రెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్ పాల్గొన్నారు.

## 22 మంది అభ్యర్థులు.. 28 సెట్ల నామినేషన్లు దాఖలు

నీలగిరి, ఏప్రిల్ 24 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. బుధవారం ఆరోరోజు 22 మంది అభ్యర్థులు 28 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి రెండు సెట్లు, బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ఒక సెట్, నూకల నరసింహారెడ్డి రెండు సెట్లు, కాంగ్రెస్ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి మూడు సెట్లు, కాంగ్రెస్ పార్టీ తరపున కుందూరు జానారెడ్డి రెండు సెట్లు, ధర్మసమాజ్ పార్టీ నుంచి తలారి రాంబాబు ఒక సెట్, బీఎస్పీ నుంచి విరిగినేని అంజయ్య ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య రెండు సెట్లు, నేషనల్ పీపుల్స్ పార్టీ తరపున చిలుక రాంబాబు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా శిరసాల శీనయ్య, అఖిల్ సంపంగి, పాలకూరి రమాదేవి, పాలకూరి రవి, గోలి సైదులు, పోతుల యాదగిరి, పోతుల ప్రార్థన, కుందారపు శ్రీకాంత్, గంగిరెడ్డి కోటిరెడ్డి, నూనె సురేశ్, షేక్ ఉస్మాన్ బాబా, ధరావత్ మోతీలాల్, అంజనపల్లి రవి తమ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు అందించారు.

**రఘువీర్‌రెడ్డి నామినేషన్ దాఖలు**

నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా కుందూరు రఘువీర్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా క్లాక్‌టవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. పదేండ్లు సీఎంగా రేవంత్‌రెడ్డి ఉంటారని, తామంతా ఒక టీమ్‌లాగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందూరు జానారెడ్డి ఎమ్మెల్యేలు బాలూనాయక్, జయవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామెదర్‌రెడ్డి, సీపీఎం, సీపీఐ నాయకులు జూలకంటి రంగారెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మల్లు లక్ష్మి పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- రాష్ట్రంలో నల్లగొండ జిల్లాకు ఫస్టియర్ 14, సెకండియర్‌లో 10వ స్థానం
- సూర్యాపేట జిల్లాకు ఫస్టియర్ 28, సెకండియర్‌లో 24వ స్థానం
- కస్తూర్బా, గురుకులాల్లోనూ ఉత్తమ ఫలితాలు

రామగిరి, ఏప్రిల్ 24 : ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలు హవా చూపించారు. గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలో నల్లగొండ జిల్లా ప్రథమ సంవత్సరంలో 14వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 10వ స్థానంలో నిలిచింది. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో అత్యధికంగా 992, ప్రథమ సంవత్సరంలో 468 మార్కులు.. బైపీసీ ద్వితీయలో 987, ప్రథమలో 437 మార్కులు వచ్చాయి.

**ఫస్టియర్‌లో 57.2, సెకండియర్‌లో 68.73 శాతం ఉత్తీర్ణత**

ఫస్టియర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 11,555మంది హాజరుకాగా 6,610 మంది (57.2శాతం) ఉత్తీర్ణత సాధించారు. జనరల్ విభాగంలో బాలురు 5,319మందికి 2,539 మంది(47.73శాతం), బాలికలు 6,236 మందికి 4,071మంది (65.28 శాతం) పాస్ అయ్యారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో విభాగంలో 2,342 మందికి 1,136 మంది (48.51శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 1,351 మందికి 500మంది, బాలికలు 991మందికి 636 మంది పాస్ అయ్యారు. సెకండియర్ పరీక్షలకు 11,474మంది హాజరుకాగా 7,854 మంది (68.73శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో జనరల్ విభాగానికి చెందిన బాలురు 5,390 మందికి 3,337మంది (61.91శాతం), బాలికలు 6,084మందికి 4,517మంది (74.24 శాతం) పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్‌లో 2,167 మంది విద్యార్థులకు 1,335 మంది (61.61 శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 1,198 మందికి 579 మంది, బాలికలు 969 మందికి 756 మంది పాస్ అయ్యారు. కస్తూర్బా, గురుకుల, మోడల్ స్కూల్ విద్యార్థులు సైతం ఉత్తమ ఫలితాలు సాధించారు. గతేడాది ఫలితాల్లో ప్రథమ 13, ద్వితీయ 12వ స్థానాల్లో ఉండగా ఈ సారి కొంత మెరుగుపడిందని
జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రూ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**WANTED**
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-AI

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |


మిర్యాలగూడ, ఏప్రిల్ 24 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర తొలిరోజు విజయవంతమైంది. బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం మిర్యాలగూడలో నిర్వహించిన రోడ్‌షోకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. సాయంత్రం 6.20 గంటలకు హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ప్రారంభమైన రోడ్‌షో సాగర్ రోడ్డు మీదుగా రాజీవ్‌చౌక్ వరకు సాగింది. వేలాదిగా రైతులు, వివిధ వర్గాల ప్రజలతోపాటు బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొనడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పార్టీ జెండాలు, కటౌట్లు, తోరణాలతో మిర్యాలగూడ గులాబీమయమైంది. కళాకారుల ఆటపాటలు అలరించాయి. గోండు నృత్యాలు, మహిళలు బోనాలతో ర్యాలీలో పాల్గొన్నారు. రోడ్‌షో సాగుతున్నంత సేపు కేసీఆర్ వస్తున్న బస్సుపై కార్యకర్తలు, అభిమానులు పూల వర్షాన్ని కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్ మాట్లాడుతున్నప్పుడు ఈలలు, కేరింతలతో హోరెత్తించారు. రైతు బంధు వేశారా?.. రూ.2లక్షల రుణమాఫీ అయిందా?.. అని కేసీఆర్ అడుగగా రైతులు, ప్రజల నుంచి లేదు అనే సమాధానం వచ్చింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తానని, అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తానని సీఎం రేవంత్ చెప్పాడని.. మరీ మీకు అవి అందాయా? అని అడుగగా ఏ ఒక్కటీ రాలేదని ప్రజలు గట్టిగా కేకలు వేసి చేతులు ఊపి బదులిచ్చారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రతిష్టాత్మకంగా తీసుకొని రోడ్‌షో సక్సెస్‌కు కృషి చేశారు.

**మే 13 వరకూ ఇదే ఉత్సాహం కొనసాగించండి**

- నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

నకిరేకల్, ఏప్రిల్ 24 : ఈ రోజు బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు, రైతులు కనబర్చిన ఉత్సాహాన్ని మే 13వరకూ కొనసాగించాలని, బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారు. కేసీఆర్ బస్సు యాత్ర మిర్యాలగూడ నుంచి సూర్యాపేటకు వెళ్తూ మండలంలోని చీమలగడ్డ ఫైఓవర్ వద్ద కాసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానికులు, బీఆర్‌ఎస్ శ్రేణులు కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. మహిళా ప్రజాప్రతినిధులు హారతిపట్టారు. కార్యకర్తలు ఉత్సాహంగా బస్సుపై పూలవర్షం కురిపించారు. సూర్యాపేటలో రోడ్‌షో ఉందని... తొందరగా వెళ్లాలంటూనే..కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి కొద్దిసేపు ఆగారు.

**దేవుడిని రాజకీయాల్లోకి లాగుతున్నరు : బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్**

అంతకుముందు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు రాముడిని రాజకీయాల్లోకి లాగుతున్నారని, వాళ్లు పుట్టకముందే ప్రజలు రాముడిని కొలుస్తున్నారన్నారు. తనను గెలిపిస్తే తెలంగాణ వాదాన్ని ఢిల్లీలో వినిపిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం అందరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, జడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు నవీన్‌రావు, సైదిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.




మిర్యాలగూడ రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, పక్కన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

## ఆందోళన వద్దు.. మళ్లీ మంచి రోజులు వస్తాయి

- రైతులకు భరోసా కల్పించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

నీలగిరి, ఏప్రిల్ 24: రైతులు, ప్రజలు ఆందోళన చెందొద్దు.. త్వరలో మంచి రోజులు వస్తాయి.. కంగారు పడొద్దు.. అంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు భరోసా కల్పించారు. బుధవారం హైదరాబాద్ నుంచి మిర్యాలగూడలో జరుగనున్న బస్సు యాత్రకు వెళ్తున్న క్రమంలో నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామం వద్ద కొద్దిసేపు ఆగి రైతులతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల సమస్యలు మీరు తప్ప ఎవరూ పట్టించుకోరు అంటూ రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి బాధలు విన్న బీఆర్‌ఎస్ అధినేత అధైర్య పడొద్దు.. మీకు అండగా నేనుంటానంటూ ధైర్యం కల్పించారు. అక్కడికి వచ్చిన రైతులు కేసీఆర్‌తో సెల్ఫీలు దిగారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ ఉన్నారు.



మాడ్గులపల్లిలో హోటల్‌లో స్నాక్స్ తీసుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్ చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు



రోడ్‌షోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు




తిప్పర్తి రోడ్‌షోలో మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతుండగా తమ సెల్‌ఫోన్‌ల ద్వారా ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడుతున్న ప్రజలు



బీఆర్‌ఎస్ అధినేతకు హారతి పట్టేందుకు వచ్చిన నకిరేకల్ జడ్పీటీసీ మాద ధనలక్ష్మీ , కౌన్సిలర్లు

## అతివేగం.. అజాగ్రత్త వల్లే రోడ్డు ప్రమాదాలు

**రోడ్లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ చందనా దీప్తి**

నీలగిరి, ఏప్రిల్ 24 : అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహన దారులు తమపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానం చేరాలని జిల్లా ఎస్పీ చందనాదీప్తి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రమాదాల నివారణకు, ప్రమాదాల నుంచి ప్రాణాలతో బయట పడేందుకు ఏర్పాటు చేసిన సాంకేతిక, రక్షణ వ్యవస్థలను సైతం వాహన దారులు తేలిగ్గా తీసుకోవడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. వాహన వేగం తగ్గించి నడుపడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని పెర్కొన్నారు. డ్రంకెన్ డ్రైవ్, అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎండాకాలంలో వాహన దారులు సేద తీరేందుకు రహదారులపై వాహనాలు నిలుపుతున్నారని, అలా నిలుపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు మీద వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఏప్రిల్ 25 నుంచి ఓటు హక్కుపై ఛాయా చిత్ర ప్రదర్శన

నీలగిరి, ఏప్రిల్ 24 : కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ఈ నెల 25 నుంచి 27 వరకు ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జిల్లా క్షేత్ర ప్రచార అధికారి జి.కోటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రదర్శనను 25న ఉదయం 9.30 గంటలకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

### జమియతే ఉలమా ఏ హింద్ మండల అధ్యక్షుడిగా నజీర్ ఖాస్మి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 24 : జమియతే ఉలమా ఏ హింద్ మండల అధ్యక్షుడిగా కొండమల్లేపల్లికి చెందిన మౌలానా నజీర్ ఖాస్మి ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ముస్లిం సమాజాభివృద్ధి, విద్య, వైద్యం, ఆర్థిక, సామాజిక రంగాల్లో వారిని చైతన్య పర్చడం సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. తమ సంస్థ భారత రాజ్యంగానికి లోబడి కార్యకలాపాలు సాగిస్తుందని తెలిపారు.

## కారు బోల్తాపడి.. ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 24 : కారు బోల్తా పడి ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రంగారెడ్డిగూడెం స్టేజీ వద్ద కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఎండీ జహీర్ వ్యక్తిగత పని మీద స్నేహితులతో కలిసి కారులో సాగర్‌కు వెళ్తుండగా రంగారెడ్డిగూడెం ఏఎమ్మార్పీ కెనాల్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై కోతులు ఉండడంతో సడన్‌గా బ్రేక్ వేశాడు. దాంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న మెట్రో వాటర్ బోర్డు దిమ్మెకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎండీ అజహార్ (32), అతని స్నేహితురాలు సమీరాబేగం (30) అక్కడికక్కడే మృతి చెందారు. ఎండీ జహీర్, మదీనా తీవ్రంగా గాయపడగా.. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. జహీర్ సోదరుడు ఫరీద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు అతి వేగం, రోడ్డుపై బ్రిడ్జి వద్ద ఉన్న కోతులు ప్రమాదానికి కారణమని తెలుస్తుంది. సంఘటనా స్థలాన్ని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్, ఎస్ఐ నర్సింహులు పరిశీలించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈఓ దస్రూ, కళాశాల డైరెక్టర్లు

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రగతి జయకేతనం

రామగిరి, ఏప్రిల్ 24: ఇంటర్మీడియట్ ఫలితాల్లో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి జయకేతనం ఎగురవేసినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎమ్.అజయ్‌కుమార్, వి.మీనాక్షి, మనార్‌జైనా 468 మార్కులు, బైపీసీలో కె.ఉజ్వల 437, భవ్య, అక్షయ, సీహెచ్.శివాణి 436 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కె.పవన్‌కుమార్, ఆర్.మౌనిక 992, జె.సాయిచందన, సిరిచందన 990 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు అనేక మంది విద్యార్థులు 980కు పైగా సాధించినట్లు చెప్పారు. వీరిని డీఐఈఓ దస్రూనాయక్‌తోపాటు కళాశాల చైర్మన్ చందాకృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్‌బాబు, ఎన్.శశిధర్‌రావు,
చందా శ్రీనివాస్, పైళ్ల రమేశ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



ఇంటర్ టాపర్స్‌ను అభినందిస్తున్న గౌతమి జూనియర్ కళాశాల డైరెక్టర్ రమణారెడ్డి

## ఇంటర్ ఫలితాల్లో గౌతమి విద్యార్థుల ప్రభంజనం

రామగిరి, ఏప్రిల్ 24 : నల్లగొండలోని గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభంజన సృష్టించి రాష్ట్ర, జిల్లాస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డి బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో ఎన్.నమ్రాత, షేక్ ఆఫ్రిన్ 992, బైపీసీలో యాస్మిన్ , సీహెచ్. లక్ష్మీప్రసన్న 983 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గోపీచంద్, అఖిల, సీహెచ్. యమున, విశ్వనాథుల హేమచందర్ 468 మార్కులు, బైపీసీలో యాసతిక్ష, బి.పూజ 437, మలిహాతస్నీమ్ 436 సాధించారని, చాలా మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు.

### తెలంగాణ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

తిప్పర్తి, ఏప్రిల్ 24 : తెలంగాణ ప్రజలకు, రైతులకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బస్సుయాత్రలో భాగంగా తిప్పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు బాధలు, ఇబ్బందులు లేవని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాక ముందే రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయన్నారు. కనీసం వారి పండించిన ధాన్యం కొనలేని పరిస్థితిలో ఇప్పటి ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ మూడు నెలల పాలనలో ఇప్పటి వరకు 204 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు సకాలంలో వేసి రైతులను ఆదుకున్నామని, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు వేయక, తాగు, సాగునీటికి కూడా ఇబ్బందులు పెడుతుందన్నారు. పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నాం, మళ్లీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచుదామన్నారు. కేంద్రంలో పట్టు సాధించి తెలంగాణ భవిష్యత్‌ను కాపాడు కోవడానికి బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, రమావత్ రవీందర్ కుమార్, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నకిరేకల్ : మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ పక్కన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


### బీఆర్‌ఎస్ పాలనే శ్రీరామరక్ష



బీఆర్‌ఎస్ పాలనలోనే రైతులు అభివృద్ధి చెందారు. సకాలంలో రైతు బంధు టింగ్‌టింగ్ మని మా అకౌంట్‌లో నగదు జమ అయ్యేది. చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ.5లక్షల రైతు బీమాను ఇచ్చి ఆదుకున్నది. రైతుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన కేసీఆర్ రుణమాఫీ చేసి అండగా నిలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆగం చేస్తున్నది. సాగర్‌లో నీళ్లున్నా వదలకుండా పంటలను ఎండబెట్టింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

–మజ్జిగపు శ్యామ్, యువ రైతు, వేములపల్లి, నల్లగొండ జిల్లా

### రైతు పక్షపాతి కేసీఆర్



ఎల్లప్పుడూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా మాజీ సీఎం కేసీఆర్ పని చేస్తాడు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఇబ్బంది పెడుతున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ కష్టాలు లేకుండే. ధాన్యం కొనుగోలు చేపట్టి వెంటనే డబ్బులు వేయించారు. రైతుబంధు కూడా సీజన్ టైమ్‌కు పడేది. అధికారంలో లేకపోయినా పోరుబాటతో రోడ్డెక్కి ప్రజల మంచికై కొట్లాడుతున్న కేసీఆర్‌కు అండగా ఉంటాం. వచ్చే ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేస్తాం.

– చీదళ్ల వెంకట్‌రెడ్డి, రైతు, లక్ష్మీదేవిగూడెం, వేములపల్లి

### కేసీఆర్ బస్సు యాత్రను విజవంతం చేయాలి

నాంపల్లి, ఏప్రిల్ 24 : బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం భువనగిరిలో నిర్వహించే బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు.